# మేడ్ ఫర్ టీవీ ఛానెల్



"మీ అభిమాని ఇప్పటిదాకా కూచుని వెళ్లింది. అవునూ, నాదో చిన్న సందేహం - స్త్రీ అభిమాని అయితే 'అభిమానిని' అనాలా?" అంది సావిత్రి రాజా ఇంటికి రాగానే.

"అన్ని నొక్కులు నొక్క గలిగిన దానివి సన్నాయి నేర్చుకోలేక పోయావా" అన్నాడు రాజా చాలా అక్కర చూపిస్తున్నట్టు.

"అవున్లెండి. ఉన్నమాటంటే సన్నాయి నొక్కులు నొక్కినట్టే ఉంటుంది. ఆవిడ వచ్చి గంటసేపు కూచుని మీ గాత్ర మాధుర్యం గురించీ, గాన మాధుర్యం గురించీ పొగిడి, పొగిడి వెళ్లిందో లేదో మీరే వెళ్లి అడగండి."

"మళ్లీ వెళ్లి అడగడం దేనికిలే. నువ్వు చెప్తున్నావుగా..."

"అంటే ఆవిడ చాలా అని ఉంటుందని మీ ధీమా అన్నమాట. అవునుగానీ నాకు తెలీక అడుగుతాను - మీ గొంతులో ఏవంత మాధుర్యం ఉందని ఆవిడంత ఇదై పోతుందండి?"

"పోనీ ఆవిణ్నే అడగలేకపోయావా?"

"ఎందుకు? పెళ్లాం కుళ్లుకుంటోందని ఆవిడ అనుకోవడానికా? ఆడదీ, అసూయా కవలపిల్లలని మీరు కొటేషించడానికా? మీరో పెద్ద టీవీ ఆర్టిస్టు, ఆవిడో పెద్ద కళాభిమాని. మధ్య అడ్డుగోడలా అజ్ఞానురాలిని నేను. సరే, అలాగే అనుకోండి. నాకేం నష్టం లేదు. ఐ డోంట్ కేర్" సావిత్రి ఆవేశపడసాగింది.

"ఆగాగు. నేను ఇవేమీ అనలేదు. ఏక్షన్, రియాక్షన్, ఏక్షన్ రీప్లే అన్నీ నీవే. ఐ యామ్ జస్ట్ వాచింగ్ ది ఫన్. అంతే" అన్నాడు రాజా.

"అవునవును. వేళాకోళంగానే ఉంటుంది. అసలు అదెవత్తండి? నా ఎదురుగా 'మీ ఆయన అంతటివాడు, ఇంతటివాడు, ఆయనంటే నేను పడిఛస్తాను' అని అనడమేమిటి? హౌ డేర్ షీ..."

'అదీ ఆవిణ్నే అడగలేకపోయావా' అనబోయి రాజా నోర్మూసుకున్నాడు, ఈ లోపున సావిత్రి గొంతు గద్గద మవడంతో.

అతనీ మధ్య ఇలాటి సందర్భాల్లో నోరు మూసుకుని ఉండడం సాధన చేస్తున్నాడు. మొదట్లో టీవీ ప్రోగ్రాం వచ్చిన కొత్తల్లో అతిగా వాగిన పాపానికి ఇప్పుడిలా 'కాంపెన్సేట్' చేస్తున్నాడు.

అసలా టీవీ ప్రోగ్రాం అనుకోకుండా వచ్చింది. ఓ ప్రైవేటు టీవీ ఛానెల్లో పనిచేస్తున్న సుబ్బారావుని చూడబోయినపుడు కుతూహలం కొద్దీ అంత్యాక్షరి కార్యక్రమంలో ప్రేక్షకుడిగా కూచున్నాడు. ప్రోగ్రాంలో పాల్గొన్న టీముల్లో వాళ్లు సరిగ్గా చెప్పలేకపోయిన సందర్భాల్లో తను జవాబు చెప్పడంతో నిర్వాహకుల కళ్లబడ్డాడు. కార్యక్రమం పూర్తవగానే "వచ్చే వారం కార్యక్రమంలో మీరు ఓ టీములో రాకూడదూ" అన్నారు వాళ్లు.

తక్షణం రాజా ఓ మేఘాన్ని కిందకు పిలిచి దానిమీద తేలుతూ ఇంటికొచ్చాడు. భార్య కూడా ఎంతో ఆనందపడింది. 'అది టీవీలో ఎప్పుడొస్తుందో కనుక్కుని చెప్పండి. మా వాళ్లందరికీ ఉత్తరాలు రాసి చూడమని చెప్తాను. మన కాలనీలో కూడా అందరికీ చెప్పి వస్తాను' అంది.

'అబ్బే, దీనిలో ఏముంది? ఇది ప్రేక్షకుడిగా మాత్రమే కదా! అసలు ప్రోగ్రాము వచ్చినప్పుడు రాద్దాంలే' అన్నాడు రాజా.

"భలేవారే, ఇది మాత్రం తక్కువేమిటి? ఒకసారి టీవీలో మొహం వచ్చిందంటే చరిత్ర కెక్కినట్టే. వీడియో చేయించి పెట్టుకున్నామంటే తరతరాలూ పడి వుంటుంది. మనం లేకపోయినా మన ఆనవాలు ఉన్నట్టే కదా."

రాజా ఆమెతో ఏకీభవించాడు. అరుదుగా జరిగే ఘట్టం ఇది. "హుషారుగా ఉన్నాం,

నీ వంటెందుకు తినడం, హోటల్‌కి పోదాం పద" అన్నాడు. మామూలు రోజుల్లో ఆ మాటకు అపార్థం చేసుకోగల సామర్థ్యం ఉన్నా ఆవేళ మాత్రం క్షమించి వదిలి పెట్టేసింది సావిత్రి.

హోటల్లో రాజా చెలరేగిపోయాడు. తనలో ఇంతటి కళ దాగున్న విషయం ఇన్నాళ్లూ తనే గుర్తించనందుకు ఆశ్చర్యపడ్డాడు. వినయం పాలు మరీ ఎక్కువై తన ప్రతిభను ప్రచారం చేసుకోనందుకు తనను తానే చివాట్లేసుకున్నాడు కూడా. అతని క్షోభ చూసి సావిత్రి కూడా ఆ నిందలో పాలు పంచుకోదలచింది.

"నాదీ పొరబాటు ఉందనుకోండి. మీరు కూనిరాగాలు తీస్తూంటే 'బాత్‌రూమ్‌కి గడియ ఉంది కదండీ బాబూ' అంటూ వేళాకోళాలాడేదాన్ని కానీ మిమ్మల్ని ప్రోత్సహించలేదు. ఓపిక పట్టి జాగ్రత్తగా విని ఉంటే నేనే చెప్పేదాన్నేమో – 'టీవీలో ప్రయత్నించకూడదా' అని. ఏదీ, తీరిక ఉంటే కదా! ఎప్పుడు చూసినా పనే..."

'అంత పెద్ద పనేం చేస్తున్నావు కనక! మనిద్దరికీ వండి వార్చడమేగా' అని రాజా అనలేదు. 'ఇంకోసారి వీలు చూసుకొని అందాంలే' అనుకొని వాయిదా వేసి తన స్వోత్కర్ష కొనసాగించాడు – "మా ఆఫీసులో ఒకతను జాతకాలు చూస్తూంటాడులే. నా జాతకం చూసాడు నిన్న. శుక్రుడు పంచమంలో ఉన్నాట్ట. అంటే లలిత కళల్లో ప్రజ్ఞ ఉంటుందిట. 'మనకు అంత టేలంటు ఏముందిరా' అనుకున్నాను. ఇవాళ చూస్తే టీవీ ఛాన్స్! తమాషాగా ఉంది కదూ..."

"భలేగా ఉందే, ఏవండీ, నాకు శుక్రుడు ఎక్కడున్నాట్టండీ..."

"మీ నాన్న ట్రంకుపెట్టెలో ఉన్నాడు. నీ జాతకం మా కెప్పుడూ చూపించలేదాయన. పెళ్లి సంబంధానికి వచ్చినప్పుడు కూడా 'నా కిలాటి వాటిపై నమ్మకం లేదండీ' అన్నాడు. ప్రమోషన్ వస్తుందా అంటూ తన జాతకం చూపించుకున్నాడు మళ్లీ."

"ఒకవేళ నా జాతకం రాయించలేదేమో..."

"నేన్నమ్మను. కావాలనే దాచేసి ఉంటాడు. ఏ దోషమో ఏదో ఉండి ఉంటుంది."

"గాడిదగుడ్డు దోషం, మీకు ఇప్పుడొచ్చిన లోటేమిటండీ? నన్ను పెళ్లి చేసుకున్నాకే మీకు టీవీ ఛాన్సు వచ్చిందని గుర్తుంచుకోండి."

జవాబు చెప్పే బాధ్యత తప్పించుకోడానికి రాజా నోట్లో ఐసుక్రీమ్ కుక్కుకున్నాడు.

రాజాకు ఇంకో ఛానెల్ నుండి పిలుపు వచ్చేపాటికి కథ చాలా దూరం పోయింది. తనసలు పుట్టడమే కళాకారుడిగా పుట్టానని రాజా అంటూంటే వినడానికి చికాకు పడుతున్న సావిత్రి, చుట్టుపక్కల వాళ్లు కూడా అదేమాట అంటూంటే చిర్రెత్తిపోయింది. అందరికంటే ఎక్కువగా పక్కింటి సుందరి, భర్త ఆరాధకురాలిగా మారిపోవడం మరీ మండించింది. 'అసలు ఇన్ని పాటలు మీకెలా గుర్తుంటాయండీ?' 'అసలు ఇవన్నీ ప్రాక్టీసు చేయడానికి మీకు టైమెలా ఉంటుందండీ?' అంటూ ఆ దద్దమ్మ చచ్చు ప్రశ్నలు వేయడం, 'అదేమిటో, నా తరహాయే అంతండీ, దానికి పెట్టిపుట్టాలనుకుంటాను.' అంటూ రాజా పోజులు కొట్టేయడం – ఇవన్నీ చూస్తుంటే సావిత్రికి కాల్చి వాతలు పెట్టాలనిపించేది.

అట్లకాడ అవసరం లేకుండా సావిత్రి చూపుల్తోనే వాతలు పెడుతూండడంతో రాజాకు తెలిసివచ్చింది – ఏదో ఒక మార్గం చూడకపోతే లాభం లేదని. ఓ కళాకారుడు, ఓ కళాభిమాని మధ్య 'అకళురాలి'గా బ్రతుకు నీడ్వడం సావిత్రికి భారంగా ఉందని గ్రహించుకున్నాడు. ఆమెకు కూడా కళామతల్లి ఒడిలో కాస్త చోటు చూపిస్తే ఉపశమిస్తుందని అంచనా వేసి తన

ఫ్రెండు సుబ్బారావు సహాయం కోరేడు.

సుబ్బారావు ఛానెల్ వాళ్లు ఆ వారం 'ప్రేక్షకుల స్పందన' కార్యక్రమంలో 'నీ దొక్క చింపుతా' సినిమాహాలు నుండి బయటకు వస్తున్న సావిత్రిని చూపించారు. "ఈ సినిమాపై మీ అభిప్రాయం ఏమిటి మేడమ్?" అనే ప్రశ్నకు "ఫెంటాస్టిక్. ఇటీజ్... ఒకలా చెప్పాలంటే... రియల్లీ... ఫామిలీ సబ్జక్టండీ... ఎవ్రివన్ మస్ట్ సీ ... అంటే ఒకళ్లే కాదు సుమా... విత్ హోల్ ఫామిలీ అన్నమాట" అని కళ్లు ఆర్పుతూ, అరచేతుల్తో పెద్ద బంతి ఎగరేస్తున్నట్టు పోజు పెట్టి చూపుడువేలితో టీవీ ప్రేక్షకుడి కన్ను పొడుస్తూ సావిత్రి జవాబు చెప్పింది.

అది టీవీలో ప్రసారం అయిన రోజున సావిత్రి మొహం టీవీ స్క్రీనంతయింది. "చకచకా సమాధానం చెప్పాను కదండీ" అంది భర్తతో. "అవునవును' అన్నాడు రాజా క్షణం ఆలసించకుండా. సావిత్రికి మరీ పొగుడుకున్నట్టుగా ఉంటుందనిపించి ఏదైనా నెగటివ్ పాయింటు దొరుకుతుందాని కాస్సేపు ఆలోచించి, "అన్ని ఇంగ్లీషు మాటలు మాట్లాడకుండా ఉంటే బాగుండేదంటారా?" అని సందేహిస్తూనే అడిగింది - 'కావాలంటే మీరు విమర్శించుకోవచ్చు' అన్న అవకాశం ఉదారంగా కలగజేస్తూ.

కానీ రాజా ఆ అవకాశాన్ని వినియోగించుకోలేదు. "భలేదానివే. అలా మాట్లాడకపోతే తెలుగువాళ్లు కాదనుకుంటారు" అని సర్ది చెప్పాడు. "అప్పుడే సినిమా నుంచి వచ్చినా, చాలా ఫ్రెష్‌గా, గ్లామరస్‌గా ఉన్నావు" అని కూడా చేర్చాడు.

"సరిగ్గా మీరన్నట్టే ఇంటిపక్క అనంత్ కూడా అన్నాడండీ" అంది సావిత్రి మర్నాడు. అనంతే కాదు, ఆనందూ, ఆదిలక్ష్మి, వాళ్ల ఆడపడుచూ, పాలవాడు అచ్చిరాజూ, ఫోను బూతు పాపారావు కూడా అదే అన్నారుట ఆ తర్వాతి రెండు, మూడు రోజుల్లో.

"టీవీ చూడడం తప్ప వీళ్లకేం పని లేనట్టుంది" అని విసుక్కున్నాడు రాజా. "అసలిన్ని ఛానెల్స్ పెట్టనివ్వడం గవర్నమెంటు తప్పు. అవి చూస్తూ జనాలు పనులు మానేస్తున్నారు" అంటూ దేశ భవిష్యత్తు గురించి వాపోయాడు కూడా.

వారం రోజులు పోయాక "మీ ఆఫీసులో పనిచేసే ఆయన జాతకం లేని వాళ్లకు చేతులు చూసి జోశ్యం చెప్పగలడా?" అని అడిగింది సావిత్రి.

"ఏం చెప్పాలి?"

"అదే, శుక్రుడు ఎక్కడున్నాడో, కళల్లో ప్రావీణ్యతా, కీర్తీ, డబ్బూ వస్తుందో రాదో చెప్పగలడా?"

"నా జాతకం ఉందిగా..."

"మీక్కాదు, నాకు. నా చెయ్యి చూసి చెప్పగల..."

"చాల్లే, పరాయి మొగాడిని చెయ్యి పట్టుకోమనడం ఏమిటి? మతిపోయిందా?" అంటూ చికాకు పడ్డాడు రాజా.

"దీనికే ఇలా అంటున్నారు. మరి మేకప్ వేసేవాడు..." అంటూ మధ్యలో ఆగిపోయింది సావిత్రి.

రాజాకు ఏదో అనుమానం వచ్చింది, మేకప్ అవసరం ఏమొచ్చిందాని. "సంగతేమిటో సరిగ్గా చెప్పి ఏడు" అన్నాడు కోపంగా. బెదురుతూనే సావిత్రి చెప్పుకొచ్చింది -

- ఇంటిదగ్గిర దేవి గుడికి గోపురం కట్టించడానికి విరాళాలు పోగేస్తున్నారట. గుడి గురించి అడ్వర్టయిజ్‌మెంట్ సినిమా తీసి కేబుల్ టీవీలతో వేయిస్తారట. దేవికి పూజ చేసి,

ఆవిడ మహిమలు ఎంత గొప్పవో చెప్పే ముఖ్యపాత్ర ఒకటి ఉందట. మొన్న టీవీలో చూసి, సావిత్రికి ఈ వేషం ఇస్తానని వాళ్లే వచ్చి అడిగారుట. సావిత్రికి ఒప్పుకోక తప్పలేదుట.

రాజా మొహం కందగడ్డలా తయారయింది. "మొగుణ్ని, నాకో మాట ముందుగా చెప్పాలని తోచలేదా?" అని అన్నాడు కోపంగా. "అంత్యాక్షరికి ఒప్పుకొన్నప్పుడు నాకు చెప్పేరా?" అని ప్రశ్నించింది సావిత్రి. రాజాకు ఏం జవాబు చెప్పాలో తెలియలేదు. "హుం" అన్నాడు. అటూ, ఇటూ తిరిగాడు. కాస్సేపటికి "నాకు పేరు రావడంతో నువ్వు అసూయతో రగిలిపోతున్నావని ఇంతదాకా చెప్పలేదు. నాకో టీవీ సీరియల్లో వేషం ఇస్తున్నారు తెలుసా?" అన్నాడతను. "నేనూ అందుకే చెప్పలేదు పూర్తిగా. ఇదయిన తర్వాత వాషింగ్ పౌడర్ ఏడ్ ఫిలింలో కూడా ఛాన్సిస్తానన్నాడాయన..." అంది సావిత్రి.'నీలో టాలెంటు ఎక్కడుంది? ఇంటిపక్కవాళ్లు ఏవో మెరమెచ్చు కబుర్లు చెప్పగానే మురిసి గంతులేస్తున్నావు కాబోలు" అన్నాడు రాజా కచ్చగా.

"మీ అభిమానిని సుందరి నడిగి వస్తా, ఎలాటి కబుర్లు చెప్తోందో" అని అంటించింది సావిత్రి.

అప్పటినుంచీ వాళ్లిద్దరి మధ్యా మాటలు లేవు.

ఈ మధ్య రాజా, సావిత్రి ఒకళ్ల కళ్లలోకి మరొకళ్లు చూసి చిరునవ్వు చిందించడం, ఒకరి అభిరుచులు మరొకరు గుర్తుపెట్టుకోవడం, కలిసి మెలసి చురుగ్గా చిన్న, చిన్న పనులు చేయడం చూసినవాళ్లకి ఈ ఫ్లాష్‌బాక్ సంగతి చెప్పినా నమ్మరు. ఎందుకంటే వాళ్లకు ఇంకో సంగతి తెలియదుగా! టీవీలో 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' కార్యక్రమానికి రాజా, సావిత్రి జంట ఎంపికయ్యారనీ, ఎలాగైనా వాళ్లజంట ఫస్ట్ ప్రైజ్ కొట్టేయాలని ఇద్దరూ శతథా ప్రయత్నిస్తున్నారనీ వాళ్లకు ఎవరు చెప్తారు కనక?

(ఆంధ్రప్రభ వీక్లీ అక్టోబరు 98)

